# విషాదం

అన్ని బస్సులూ వస్తున్నాయి. వెళుతున్నాయి. కాని, నంబరు త్రీ రాదేం? ఎంతసేపు యిలా వెయిట్ చేయడం? ఇంటర్వ్యూకి టైమై పోతుందేమిటో?

టైమెంతయిందో?

నా చేతికి వాచీ ఉన్నా బాగుండును!

'బాగుంది. బాగుంది. నా మొహానికి వాచీ ఒకటీ'— అనుకున్నాను.

"ఏమండీ, టైమెంతయిందండి?" పక్కతన్ని అడిగాను.

అతని వయస్సు ఇరవై నాలుగు ఉండవచ్చు. అతని కళ్ళు, దవడలూ లోతుకు పోకుండా ఉంటే అందగాడు కిందే జమకట్టవచ్చు. అతని ఒంటిమీద శుభ్రమైన, ఖరీదైన టెరిలీన్ కమీజు లోపల బనీయను తాలూకు మురికినీ, చిరుగుల్నీ దాయలేక పోతున్నదని అతనికి తెలీక పోయి ఉండవచ్చు. అతను తొడుక్కున్న కమీజు లూజుదీ, పాంటు పొట్టిదీ కావడం చేత చూసే వాళ్ళకి అవి అతని బట్టలు కావేమోనని అనుమానం కలగవచ్చు. కాని, అతను వేసుకున్న అడుగు అరిగిపోయిన బూటు మాత్రం అతనిదే అనిపించవచ్చు.

అతను అంత ఖరీదు బట్టల్లో ఉన్నా అతి పేదగా నాకు కనిపించడం పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపించడం లాంటిదేమోగాని అతని చేతికున్న వాచీమాత్రం దొక్కు వాచీయే అని నాకు అనిపించింది.

కరక్టే: అక్షరాలా దొక్కు వాచీయే.

అతను వాచీలోకి కళ్ళు దించేసి, చూసి, చూసి, "క్షమించండి నా వాచీ ఆగిపోయిం" దన్నాడు సిగ్గుగా.

నయం! కాలమే స్తంభించిపోయిందన్నావు కాదు, బాబూ!

అయితే అతను అంతటితో ఊరుకోలేదు. వడివడిగా మరొక అతని దగ్గరికెళ్ళి ఏమో కనుక్కొని, అంతకన్నా వడివడిగా నా దగ్గరి కొచ్చి ఏమో చెప్పాడు—చెప్పకపోతే అతణ్ణి కఠినంగా శిక్షిస్తానేమో అన్నట్టు.

అంతేనా ఏమయింది ?

ఫరవాలేదు, పోలేదు ఏముంది.

అరె. ఫరవాలేదు. బస్సుకూడా వచ్చేస్తూంది !

అరెరే. ఫర్వాలే, ఫరవాలేదు. వచ్చిన బస్సులో సీటు దొరికింది!

సొక్కా వాచీ బాబు కూడా ఈ బస్సే ఎక్కాడు. ఎక్కాడే గాని పాపం, సీటు దొరకలేదు, నిలబడి వేలాడుతున్నాడు !

ఒక పర్యాయం అతన్ని అలా పరికించి చూద్దాం నా మటుకు నాకే అసభ్యంగా కనిపించి, కిటికీలోబడి కదిలిపోతున్న దృశ్యాన్ని చూడ నారంభించాను.

ఏమిటా సుందరాతి సుందర, మనోహర, రమణీయ దృశ్యములు?

కల్లుకొట్లూ—కమ్—బ్రాకెట్ కొట్లూ, కాఫీ హోటళ్లూ, కిరాణా కొట్లూ, కొన్ని కిలోమీటర్ల దూరం కంపు కొడుతున్న కుళ్ళు కాలవా, ఆ కాలవలో సర్వ స్వతంత్రంగా దొర్లుతున్న పందులూ, కాకా హోటళ్ళూ, ముండలూ, ముండల కంపెనీలూ, రోడ్డుపై బ్రేక్ ఇన్‌స్పెక్టర్లా బస్సుల్నీ, లారీల్నీ అటకాయించేస్తున్న గేదెలూ, మూడు మేడల పక్కన మూడు వందల గుడిసెలూ, గవర్నమెంటు సారా దుకాణం దగ్గర ఏదో గందరగోళం, బార్‌లూ, బ్రాందీషాపులూ, రేషన్ డిపో. డిపో తెరవకముందే అక్కడ పెద్దక్యూలూ, అక్కడక్కడ చెట్లూ, చెట్ల కింద మంగళాళ్ళూ, బాబూ! ఒక పైసాలూ, రోడ్డు నిండా గతుకులూ, గోతులూ, రోడ్డు పక్కన చెత్తా చెదారాలూ, 'ఇచ్చట అందముగా క్రాపులు కత్తి రించబడును'లూ, హరేరామ, హరేకృష్ణ జుత్తులూ 'ఎందుకు చింత, మార్గదర్శి ఉన్నది మీ చెంత' అడ్వర్టయిజ్‌మెంట్లూ, బెల్‌బాటమ్‌లూ, అశుద్ధంతో, రొచ్చు కంపుతో అలరారుతున్న పెద్ద మదుం, దూసుకు పోతున్న కార్లూ, తొక్కలేకపోతున్న రిక్షావాళ్ళూ, సైకిళ్లూ, చెప్పుల్లేని

కాళ్లా, ఒంటిమీద బట్టల్లేకుండా సిగ్గు లేకుండా సినిమా పోస్టర్లు గుండా 'అవేవో' చూపులు చూస్తున్న బలిసిన ఆడవాళ్లా, దూరంగా కొండమీద మెడికల్ కాలేజీ.... మెడికల్ కాలేజీ.

అవును. మెడికల్ కాలేజీ.

అవును. నాకు మెడిసిన్ చదువుదామని ఆశ ఉండేది.

ఇప్పుడుకాదు, ఒకప్పుడు.

అయితే ఇప్పుడు 'అయ్యో ! మెడిసిన్ చదవలేకపోయానే' అనే బాధలేదు.

అప్పుడైనా మెడిసిన్ చదివేద్దామనుకున్నా నంటే గొప్పకోసం కాదు; ప్రజా సేవ చేద్దామని కాదు.

తల్లి. నా తల్లిని, —వారానికి కనీసం నాలుగు రోజులు మంచాన్నంటుకుపోయే నా కన్న తల్లిని, రోగిష్ఠి తల్లిని బాగుచేసుకోవాలని మెడిసిన్ చదివేద్దా మనుకున్నాను వెర్రిగా.

వెర్రి కాకపోతే మరేమిటి ? తల్లిని బాగుచేసుకోవడానికి నేను మెడిసిన్ చదివేయాలా ?

మంచి వైద్యం ఇప్పిస్తే చాలదూ ?

సరిపోతుంది. మంచి వైద్యం ఇప్పిస్తే తప్పక సరిపోతుంది.

దానికి డబ్బు కావాలి. డబ్బు మాత్రమే కావాలి.

ఈ మాయదారి ప్రపంచంలో డబ్బుంటే దొరకనిది లేనేలేదు.

ఈ మాయదారి ప్రపంచంలో డబ్బులేకపోతే ఏదీ దొరకదు.

అయితే డబ్బులేని వాళ్ళకి దొరికేవి కూడా ఉన్నాయి.

వెండి మబ్బులూ, మబ్బుల మాటున సూర్యుడూ, చుక్కలూ, చుక్కల్లో చంద్రుడూ, కొండలూ, కోనలూ, కొండాకోనలమధ్య సెలయేళ్ళూ, కిలకిలా రావాలూ, నురుగులుకక్కే కెరటాలూ(ఆకలి కడుపులకి అందంగా కనిపించకపోయినా) దొరుకుతాయి. అవేకాక, పిడుగులవర్షం, రాక్షసపు ఎండ, ఎముకల్ని తినే చలీ, బాధా, బరువూ, కరువూ, కాటకమూ కడుపుమంటా, తీరని కోరికలూ, అందని ఆశల శిఖరాలూ, నిరాశలూ,

విట్రూప్సులూ, రైలుపట్టాలూ, మాతులూ, గోతులూ, ఉరితాళ్లూ, జైళ్ళూ, అనాథ శరణాలయాలూ, ధర్మసత్రాలూ దొరుకుతాయి. గవర్నమెంటు పుణ్యానా అనుచిత వైద్యశాలలు కూడా దొరుకుతాయి. కాని, 'ఉచితం' పేరుకి మాత్రమే.

లేకుంటే నా తల్లి రోగమెందుకు నయమవదూ ?

ఆ రోజు నాకు బాగా గుర్తు. ఆ రోజు నా తల్లిని ధర్మాసుపత్రికి తీసుకెళ్ళాం. జాయిన్ చేసుకుంటామన్నారు. జాయిన్ చేసుకుంటారంటే ధర్మాసుపత్రి గదా అని ధర్మంగా జాయిన్ చేసుకుంటారనుకున్నాను. కాని, అక్కడ ధర్మంలేదు. న్యాయంలేలేదు. దయాదాక్షిణ్యాలు అసలే లేవు. మంచం కావాలంటే నలభయ్యట ! నేల పదిరూపాయలేగాని, ఖాళీ లేదట! ఆపరేషన్‌కి వందరూపాయలు చాలట ! ఇవి డాక్టర్లకట. ఇంకా వార్డుబోయిలకీ, పనివాళ్ళకీ, పాకీవాళ్ళకీ ఒక్కొక్కజట్టుకీపదేనట. బిళ్ళ పెంకులు కాదు; డబ్బు, డబ్బు. వీటికి దేనికీ బిల్లు లుండవట !

అంటే లంచమన్న మాట ! ఛీ ఛీ, లంచం ! మాయదారి లంచం.

లంచం కనీసం రెండు వందలు కావాలన్నమాట.

ఉచిత వైద్యశాలలో నా తల్లి రోగం కుదరాలంటే కనీసం రెండు వందలు ఖర్చు పెట్టాలి !

'రెండు వందలే" అని అమ్మ గుడ్లు తేలేసింది. తనకీ ఆపరేషనూ వద్దంది. తనకేరోగమూ లేదంది. ఇంటికి పోదామంది.

నాన్న "సరే, పద పద" అన్నాడు. అలా అనడం అమ్మకు రోగం లేదని నమ్మికాదు. రిక్షాకి జేబులో ఒక ఇచ్చు రూపాయి తప్పించి మరి ఇక డబ్బులేక !

అమ్మకు ఆపరేషన్ జరగలేదన్న బాధకన్నా, నాన్న ముఖంలో బాధ చూసి భరించలేకపోయాను. పెళ్ళాం రోగం కుదర్చడానికి డబ్బు సమకూర్చలేని మొగుడూ ఒక మొగుడేనా? అన్నట్టున్న నాన్న ముఖం చూసి కన్నీళ్ళు కార్చకుండా ఎంతగా ఏడ్చానో నాకు బాగా గుర్తుంది.

వారం రోజులు తరవాత గాబోలు—నాన్న ఎక్కడ ఏది తాకట్టు పెట్టాడో, ఏ పుణ్యాత్ముడు అప్పిచ్చాడో రెండు వందలు తెచ్చి అమ్మని

ఆసుపత్రికి బయలుదేరమన్నాడు. అమ్మ రానంది. నాన్న "రామే" అని ఎంత బతిమాలినా "నే చచ్చినా చస్తానుగాని ఆస్పత్రిముఖం చూడ"నంది.

"అయితే చావు" అని నాన్న విసురుగా, కోపంగా వెళ్ళిపోవడం గుర్తుంది నాకు.

అయితే అమ్మ చావలేదు. శివశివ పాడు మాటలు! అమ్మ చావగూడదు. ఎలాగోలా మా కళ్ళముందు బతికివుంటే చాలు. అదే పదివేలు. అదే మాకు వెయ్యి ఏనుగులంత బలం.

"నాకేమందులూ వద్దుగాని, నానిగాడికి మందులు కొనమం"టుంది అమ్మ.

నానిగాడు నాకు చిన్న తమ్ముడు. అమ్మకు మురిపాల ముద్దుల కొడుకు.

అమ్మకు వాడంటే ముద్దే గాని — వాడు ముద్దుగా, బొద్దుగా ఉండడు. వాడికి వయసు ఆరేళ్ళుదాటినా ఏడాది కుర్రాడు లాగానే ఉంటాడు. నడవలేడు, నించోలేడు, పాకలేడు. ఎక్కడ కూర్చున్నాడో అక్కణ్ణించి కదల్లేడు. వాడికి వయసు ఎదిగినా కాళ్లూ, చేతులూ బొత్తిగా ఎదగడం మానేశాయి. కాని, బుర్రా, కడుపూ వాడి వయసుకి మించి ఎదిగిపోతున్నాయి. వాడికి 'అమ్మా! బువ్వ' అనే మాట తప్పించి మరే మాటలూ రావు. వాడు ఎంత తింటాడనీ! నాకు భలే ఆశ్చర్యం వేస్తుంది. మా ఇంట్లో పాది తినేది వా డొక్కడూ తినేయగలడు. తినేసి ఇంకా 'బువ్వా, బువ్వా' అనగలడు. అందుచేత వాడు బువ్వకు బదులు రెండు మొట్టికాయలు తిని పడుకుంటాడు. దరిద్రుడికి ఆకలెక్కువంటే ఇదే కాబోలు అనిపిస్తుంది నాకు వాణ్ణి చూస్తే.

"టికెట్! టికెట్!"

ఉలిక్కిపడ్డాను. గతంనుంచి తూలిపడ్డాను.

"టికెట్ తీసుకోండి."

బస్ ఛార్జి ఇరవై రెండు పైసలని బయలుదేరే ముందు నాన్న చెప్పడం గుర్తు.

పావలా ఇచ్చాను.

అతడు టికెట్ ఇచ్చాడు. తిరిగి మూడు పైసా లివ్వడేం? మరిచి పోయాడేమో? అడిగి తీసుకోనేదా?

అడగనా.... మానినా.... అడగనా.... మాననా?

పైసా అయినా అడక్కుండా ఎందుకు వదిలేయాలి? ఎవరి బుర్ర కొట్టో సంపాదించిన పైసాలు కావు. ప్రతిపైసా నాన్న రక్తపు చుక్కలు.

"కండక్టరుగారూ, మూడు పైసా లివ్వడం మరిచిపోయేరు." గుర్తు చేశాను.

"హాహాహా!" అని సినిమా విలన్‌లా నవ్వాడు కండక్టరు. నవ్వుతూ అన్నాడు: "బస్సు ఛార్జీలు పెరిగి వారం రోజు లయిందమ్మాయ్. నువ్వు. కునో్కెస్లా—అమాత్రం తెలీదా? పేపర్లో కూడా రేట్లు పెరిగినట్లు వేసేరు. తమరు చూళ్ళేదా? చూడకపోతే మాదా తప్పు!"

వాడంత గట్టిగా, వెటకారంగా మాటాడ్డంతో సిగ్గుతో కుంచించుకు పోయాను.

"అదేనేమిటయ్యా, ఆడపిల్లతో మాటాడే తీరు? సరిగ్గా మాటాడ లేవూ?" అని తగులుకున్నాడు డొక్కువాచీ అబ్బాయి. "తెలీక అడిగిం దానికి సమాధానం సరిగా ఏడవరాదూ? ఆ నవ్వులేమిటీ, ఆ వెటకారా లేమిటీ? కాస్త ఒళ్ళు జాగర్త పెట్టుకొని మాటాడు" అనేటప్పటికి— "ఏటయ్యా, ఏటీ?" అని కండక్టరు కయ్యానికి దిగాడు. పెద్ద ఘర్షణ జరిగేదే. కాని, బస్సులో వాళ్ళంతా నాకు సపోర్టు వచ్చిన డొక్కు వాచీ అబ్బాయికి సపోర్టు రావడంతో కండక్టరు కిక్కురుమనకుండా మూల కెళ్ళిపోయాడు.

నన్ను అవమానించిన కండక్టరు వెధవని చెడామడా తిట్టిపోసి నందుకు ఆ అబ్బాయికి కృతజ్ఞతతోనే కూర్చున్నసీటు యిచ్చేసి గౌరవంతో కూర్చోమందా మనిపించింది. అనిపించడం బాగానే ఉందిగాని, అలా ఆచరించాలంటే సిగ్గు వేయదూ? నాకు ముందే చచ్చేటంత సిగ్గు.

బస్సు రేటు నాన్న కరెక్టుగా చెబితే ఇంత అవమానం, ఇంత గొడవా రాకపోను. తెలియనప్పుడు చెప్పడం మానేయాలి. అంతేగానీ— అందుచేత నాన్నమీద కోపం వచ్చింది.

మరుక్షణంలోనే వచ్చిన కోపం వచ్చినట్టు పోయింది. నా పిచ్చి గాని — నాన్నమీద కోపమేమిటి — నా మొహం! నాన్న ఎవర్నో అడిగి చెప్పి ఉంటాడు. ఏమంటే, నాకు తెలిసినంతవరకూ నాన్న బస్సెక్కడం నేను చూడలేదు. ఒంట్లో కుదురుగా లేకపోయినా రెండు మైళ్ళ దూరంలో ఉన్న స్కూలుకి నడిచే వెళతాడు నాన్న. పావలా ఇచ్చి బస్సెక్కే బదులు రెండు వంకాయలు - ఒకపూట కూరగాయలు కొనవచ్చుననుకొనే దౌర్భాగ్య స్థితి నాన్నది. వచ్చే జీతపు రాళ్ళలో తనకోసం ఒక రూపాయైనా వెచ్చించడు. ఖర్చుపెట్టుకోడు. నాకు బాగా గుర్తు — మూడేళ్ళ కిందటనుకుంటా — తన ఖర్చు కింద పది రూపాయలదాకా అయిపోతున్నాయని చుట్టలుతాగే అలవాటు బలాత్కారంగా మానుకున్నాడు నాన్న. కాని, నెల కొక రూపాయిపెట్టి లాటరీ టిక్కెట్టు కొంటాడు. తన దారిద్ర్యాన్ని తీర్చేది లాటరీ తప్ప, మరో మార్గం లేదని కాబోలు, నాన్న పిచ్చి గాని, వెర్రి ఆశగాని లాటరీలో లక్షలు వచ్చేయడమే!

అదేమిటో నాన్నెప్పుడూ అదోలా ఉంటాడు. నాన్నకోసం నాన్న లేశమాత్రమైనా బతుకుతున్నట్టు కనిపించడు. ఇల్లు, పెళ్ళాం, పిల్లలకోసం, వాళ్ళ రోగాలు, చదువులు, పెళ్ళిళ్ళు తీర్చడంకోసం, అరువులు, అప్పులు చేసైనా ఆకలి దప్పులు తీర్చడంకోసం — కేవలం వీటికోసం మాత్రమే బతుకుతున్నట్టు కనిపిస్తాడు నాన్న.... జీవచ్ఛవంలా నాన్న.

ఒకొక్కసారి నాన్న బాధ చూడలేక నా గుడ్లు పీకేసుకోవాలనిపిస్తుంది.

సరిగా పుస్తకాలు కొనకపోతే, స్కూలుఫీజు కట్టకపోతే అంతగా బాధపడకపోయినా — సినిమాకి డబ్బులూ, పిక్నిక్కి డబ్బులూ, కాఫీలకు డబ్బులూ దొరక్కపోతే అతిగా, అమితంగా బాధపడిపోతూ, జుట్టు పీక్కొని, నెత్తి కొట్టుకొని, అలిగి, ఏడ్చి, అమ్మని తిట్టేనా పదమూడేళ్ళ తమ్ముడు ఒకసారి నాన్నఎదుట ధైర్యంగా నించుని "అలాంటప్పుడు నన్నెందుకు కన్నా"రని గట్టిగా, పిచ్చిగా, తెలివి తక్కువగా వాగినప్పుడు నాన్న వాడి మీదకు చెయ్యెత్తి, 'అవున్రా, కన్నాను, నాలాంటి దరిద్రుడు పిల్లల్ని కనడం తప్పే, పాపమే. కాని, మీ రెంత పాపిష్ఠి వెధవలు

కాకపోతే నా కడుపున పుడతారు! పుట్టినందుకు మంచం మీద చావరా. వెధవా, చావు" అని కేకలు వేసి, ఆ ఎత్తిన చేత్తో వాణ్ణి కొట్టకుండా, దాచుకుంటా తన నెత్తి కొట్టుకొని, గుండెలు బాదుకొని ఎంతగానో ఏడ్చాడు నాన్న!

తన పరికిణీలు చినిగిపోయాయనీ, ఉన్న రెండు జాకెట్లూ రంగు వెలిసి పోయాయనీ, లంగాలు పొట్టి అయి పోయేయనీ, తోటి ఆడ పిల్లలతో తిరగలేక పోతున్నాననీ ఎంత అలిగినా, ఎంత ఏడ్చినా లాభంలేదని —ఒకరోజు ఖరీదైన, కొత్త పైన లంగా, జాకెట్టూ, పరికిణీ కట్టుకున్న నా పదమూడేళ్ళ చెల్లెల్ని "అవి ఎక్కడివే" అనడిగితే, ఎదురింటి రమ [illegible]మ్మ పని మాతో బొంకి, మాతో బొంకినట్టు నాన్నతో బొంకి, అది బొంకని తెలిసేలోపుగానే ఇంట్లోంచి పారిపోయిన దాన్ని— ఎండనకా, వడ గాలికి జంకకా, నూతులూ, గోతులూ, రైలు పట్టాలూ వెదికి వెదికి, తిరిగి తిరిగి, చివరికి సముద్రం దగ్గర ఇసుక ఒడ్డున ఆడవాళ్ళంటే ఆకలేసే ఒక కుర్రాడి ప్రక్కన కూర్చున్న చెల్లెల్ని ఇంటి కీడ్చుకొచ్చి, గొడ్డులా దాన్ని బాది నప్పటికీ—ఇదంతా జరగడానికి తనే కారణం అన్నట్టు ఆడ పిల్లలా భోరున ఏడ్చాడు నాన్న.

ఇంట్లో ఎదిగి కూర్చున్న చెల్లెలికి, నాకూ మొగుళ్ళు రావడం లేదంటే అందుకు కారణం నాన్న అప్రయోజకత్వమనీ, చేతగానితనమనీ అమ్మ మంచంమీంచే మూలుగుతూ, నిందిస్తూ, "నేను చస్తేగాని నా పిల్లలకి పెళ్ళిళ్ళు చేయవు. అని ఏడ్చే పిచ్చి, తెలివి తక్కువ అమ్మని— "ఏడువు, ఇంకా బాగా ఏడువు. ఏడ్చి ఏడ్చి చావు. నీవూ, నీ పిల్లలూ నన్ను తినేయడానికి దాపురించేరు" అని నాన్న అరిచి నప్పటికీ మా పెళ్ళిళ్ళు కాకపోవడానికి కారణం తనఅప్రయోజకత్వమేననీ, తనచేతగాని తనమేననీ లోలోపల కుమిలిపోతున్న నాన్న గుండెల్లో అగ్ని పర్వతాలు బద్దలవుతున్నాయని గ్రహించలేనా?

ఇలా నాన్నను ఒకళ్ళేమిటి? ప్రతి ఒకరూ బాధిస్తున్నారు— గుండెలమీద కుంపటి లాగున్న నేనూ, రోజూ నల్లమందు మింగడానికి సరిపోయే డబ్బు లివ్వడం లేదని నాయనమ్మ, పాలు చాలకగా ఇచ్చే

లచ్చి, అరువు ఇవ్వని కోమటీ, ఇంటి అద్దెవాడూ, కాబూలీవాడూ— వీళ్ళంతా ఎంత వేధించుకు తింటున్నా ఎంత ఒడిపించుకు తింటున్నా ఆ బాధల్నీ, వేదనల్నీ గరళం మింగిన శివుడిలా ఎలా భరించ గలుగుతున్నాడో నాన్న!

హరిశ్చంద్రుడి నిజాయితీని పరీక్షించాడు విశ్వామిత్రుడు.

నాన్న సహనాన్నీ, ఓరిమినీ పరీక్షిస్తున్నాడా భగవంతుడు!

లేకుంటే ఏమిటి?

ఒక పక్క బస్సురేట్లు పెరిగిపోతున్నాయి. తిండి గింజల ధరలూ, కూరగాయల ధరలూ పెరిగిపోతున్నాయి. ఇంటి అద్దెలు పెరిగి పోతున్నాయి. హాస్టల్ ఛార్జీలు పెరిగిపోతున్నాయి. పన్నులు పెరిగిపోతున్నాయి. ఒకటేమిటి— అన్నీ, అంతా, సమస్తం పెరిగిపోతున్నాయి; ఉవ్వెత్తున పెరిగిపోతున్నాయి.

ఎన్ని పెరిగినా నాన్న జీతం మటుకు పెరగటం లేదు.

పెరగకపోతే పోయే— పోనీ, ఆ ముష్టి జీతమైనా సరిగా నెలాఖరున ఇచ్చి చావరు గదా? మూణ్ణెల్ల కొకసారీ, ఆర్నెల్ల కొకసారీనా ఇవ్వడం జీతం? మాస్టారు ఉద్యోగం లాంటి మరో దిక్కుమాలిన ఉద్యోగం ఈ ప్రపంచంలో లేదనిపిస్తుంది నాకు.

'నాకు జీతం దొరకలేదు, బాబూ' అంటే ఇంటి అద్దె వాడు ఊరుకుంటాడా? కిరాణా కొట్టు కోమటి ఊరుకుంటాడా? పాలిచ్చే లచ్చి ఊరుకుంటుందా? క్షుద్బాధ ఆగుతుందా?

నాన్న వాళ్ళనీ (వాటినీ) ఊరుకో బెట్టడానికి పడేపాట్లు చూడలేక నాకు ఏ నూతిలోనో పడి చచ్చిపోవాలనిపిస్తుంది,

కాని, చచ్చిపోయేకన్నా బతికే నాన్నకు 'వేడి నీళ్ళకు చన్నీళ్ళా' అనుకోవడం కూతురుగా నా కర్తవ్యం అనిపించింది. నాన్నకు నా అంత కొడుకే ఉంటే ఎంత ధైర్యంగా ఉండేది! ఆ ధైర్యం నేనెందుకు కలిగించ కూడదు? ఎందుకు కలిగించలేనూ?

అందుకే నాన్నకు తెలీకుండా నా పేరు ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిలో నమోదు చేయడం, చేసిన మూడేళ్ళకి ఎంప్లాయిమెంటు వారి పుణ్యమా అని ఒక ఇంటర్వ్యూకి కాల్ లెటర్ రావడం జరిగింది.

అప్పుడు నాన్నకు చెప్పి క్షమించమన్నాను. నాన్న క్షమించలేదు. తనకు తెలియకుండా ఇంత నడిపినందుకు తొలుత మండి పడ్డాడు. కోప్పడ్డాడు. ఆ తరువాత— "ఉద్యోగం చేయద్దమ్మా" అని బ్రతిమాలాడు.

"ఇరవై ఏళ్లు దాటిన నీకు పెళ్ళి చేసి అత్త వారింటికి పంపే బదులు నిన్ను ఉద్యోగానికి పంపించ మంటావటే తల్లీ" అని కన్నీళ్ళు పెట్టుకున్నాడు నాన్న.

"అయ్యో. నాన్నా! ఎందుకా కన్నీళ్లు? ఏడవకు, నాన్నా, ఏడవకు అని కన్నీళ్ళని తుడిచి, నేను తల్లి అంత పెరిగిపోయి నాన్న తల నిమిరి ఓదార్చాలనిపించింది.

"నాకు పెళ్ళి అక్కర్లేదు. నాన్నా. వద్దు, నాన్నా. వద్దు, వద్దు నిజమే, నాన్నా" అంటే నా మాట వినడు కదా—నమ్మడు కదా!

ఏ లాంటి ఆడదానికైనా పెళ్ళంటే ఎందుకిష్టంవుండదూ? ఉంటుంది. నాకూ ఇష్టముంది. కాని, నాకు అక్కర్లేదు. నిజంగానే పెళ్ళి నాకక్కర్లేదు. నాన్న రక్తాన్ని బలికోరే రక్త పిశాచి పెళ్ళి నా కక్కర్లేదు, నా కక్కర్లేదు అని నేను ఎంత మొత్తుకున్నా తన రక్తంతో తోడేళ్ళ పెళ్ళి కొడుకుల్ని కొందామని తాపత్రయ పడతాడు నాన్న. కాని, ఆ తోడేళ్ళది తీరని దాహమనీ. తను ఇచ్చే రక్తం బొత్తిగా చాలదనీ నాన్నకు తెలియదా? తెలుసా?

తెలియనీయ్, తెలియకపోనీయ్— నాన్న ఎలాగైతేనేం ఉద్యోగం చేయడానికి ఒప్పుకున్నాడు అదే చాలు.

ఉద్యోగం రావాలేగాని, మెడలో మంగళసూత్రం తగిలించే ఆనందంకన్నా వేయి రెట్లు ఆనందం పొందగలను.

బస్సు కుదుపుతో ఆగింది.

బస్సు ఎందుకాగింది?

ఎదురుగా గేటు వేసి వుంది. బండి వస్తుందా? మరింకా రాదేం?

బండి ఎప్పుడు వస్తుందో? గేటు ఎప్పుడు తీస్తారు? బస్సు కదిలే దెప్పుడు? నేను ఇంటర్వ్యూకి అందుకొనేదెప్పుడు? అమ్మజబ్బూ, అమ్మ కలలూ తీరేదెప్పుడు? నానిగాడి కెప్పుడు ఆకలి జబ్బు తీరేది? చెల్లెలు ఎప్పుడు మంచి పరికిణీలు కట్టేది? తమ్ముడి సరదాలూ, ఇంట్లో దారిద్ర్యం, ఊళ్ళో అప్పులూ తీరేదెప్పుడు? నాన్న ముఖంలో దైన్యం, హైన్యం, దౌర్భాగ్యం తొలగే దెప్పుడు? ఎప్పుడు?

ఎప్పుడో కదా!

ప్రస్తుతం మటుకు బండి రావడం, గేటు తీయడం, బస్సుకదలడం జరిగింది.

ఇంటర్వ్యూకి అందే టైముకి బస్సు దింపడం కూడా జరిగింది.

బస్సు దిగగానే నా కంతా అయోమయం అనిపించింది. నేను వెళ్ళవలసిన ఫ్యాక్టరీ ఎక్కడుంది? ఎటువైపు వెళ్ళాలి! నేను ఇవన్నీ ముందే ఎందుకు తెలుసుకోలేమా? బహుశా బస్సు దిగగానే ఎదురుగా 'ఆహ్వానం' అనే బోర్డుతో పోస్టరు ఉంటుందనుకున్నానా!

ఏమిటో --- ఇప్పుడెలాగ? ఏం చేయడంరాదేవుడా అని గుండెల్లో గుబులు పట్టుకున్న నాకు --- అడివిలో తోడు దొరికినట్టు, కటిక చీకట్లో దీపం దొరికినట్లు డొక్కువాచీ అబ్బాయి దొరికాడు.

అతనుకూడా ఇంటర్వ్యూకే వస్తున్నాడట.

అతను నాకు తోడుగా దేవుడు పంపిన మనిషి అనిపించింది.

అవును ఉదయం నేను బయలుదేరే ముందు దేవుడికి మొక్కాను, అంతా సవ్యంగా జరపమని.

చూడగా అంతా సవ్యంగా జరుగుతున్నట్టుగానే ఉంది. లేకుంటే బస్సులో నా తరఫున నిలబడ్డ అతనే తోవ తెలియక అయోమయంలో పడిపోయిన నాకు తోడుగా వచ్చి ఫ్యాక్టరీకి తీసుకెళ్ళడ మేమిటి?

డొక్కు వాచీ అబ్బాయి చూడగా కలుపుగోలు మనిషి అనిపించింది. బాగా పరిచయం ఉన్నవాళ్ళతో మాటాడేస్తున్నట్టు నాతో మాటాడేస్తున్నాడు. చాలా సరదాగా, చలాకీగా, హుషారుగా మాటాడుతున్నాడు.

అతనలా మాటాడుతున్నందుకు నాకేం భయం వేయలేదు. నా కతను ఆడ పిల్లల్ని ఏడిపించే రౌడీ వెధవలాగ కనిపించలేదు.

అతను వివరాలు చెబుతున్నాడు. పోస్టులు రెండేనట. కాల్ లెటర్స్ పంపించింది సుప్పయి మందికి పైనట! ఆ ఇన్ఫర్మేషన్ ఎంప్లాయిమెంటులో పనిచేస్తున్న అతని స్నేహితుడిచ్చాడట!

నాకు నిరుత్సాహం, నీరసం వచ్చేశాయి.

ఇదేమిట్రా బాబూ. ఇలా గంటున్నాడు — నేను ఎంతో 'హోప్'తో వస్తే! సుప్పయి మందిలో ఇద్దరికా? సరిపోయింది ఇక ఉద్యోగం వచ్చి నట్టే. గోవిందా! ఇంటికి తిరిగి వెళ్ళిపోదామని పించింది.

ఇంతదూరం వచ్చాక తిరిగి వెళ్ళిపోవడ మేమిటి? చూద్దాం. అదృష్టం అనేది ఎవర్ని వరిస్తుందో చెప్పలేం — అనే ఆశ!

ఈ ఆశ అనేది ఉంది చూశారూ మనిషి చచ్చినా మనిషిలో ఆశ మాత్రం చచ్చినా చావదు.

మాట్లాడుతూ నన్ను ఆ రోడ్డు నుంచి ఈ రోడ్డుకీ, ఈ రోడ్డు నుంచి అవతల రోడ్డుకీ తెగ తిప్పేస్తున్నాడు.

నయం. ఇతను లేకపోతే నా అవస్థ ఎలాగుండేదో?

"మీ కిదే మొదటి ఇంటర్వ్యూ లాగుంది" అన్నాడతను.

అవునన్నాను.

"కానీ, చూశారూ — నాకు మాత్రం ఇది ఏ పదమూడోదో, ఏ పధ్నాలుగోదో. అవునండీ. ఆశ్చర్యపోతారేం? మా ఫ్రెండ్ కాల్ లెటరు పంపించేస్తున్నాడు. మనం ఎంచక్కా వెళ్ళొచ్చేస్తున్నాం. సాధించకుండా వెళ్ళొచ్చేయడమంటే ఘజనీబాబు లాగ, ఘోరీ తాత లాగ మీకు నేను కనిపించవచ్చు. సాధించలేకపోతున్నాననంటే నాది పూర్ స్టాండర్డనీ, పూర్ క్వాలిఫికేషననీ, మెరిట్ లేని వాణ్ణనీ మీకు అనిపించవచ్చు. కాని, అవి కారణాలు కాదండోయ్. పూర్ క్లాస్ ఫోర్ జాబులకి, బోడి గుమాస్తా ఉద్యోగాలకీ నా దగ్గర సెలెక్టు కావడానికి కావలసినంత స్టాండర్డు, కావలసినంత క్వాలిఫికేషన్, కావలసినంత మెరిట్టు అన్నీ ఉన్నాయి. కాని,

అవి చాలవనీ, అసలవి అక్కర్లేదనీ, లంచాలూ, రికమెండేషన్లూ మాత్రమే కావాలనీ, అవి వుంటే చాలనీ నా అనుభవం ఎంచక్కా నేర్పింది. అయితే అనుభవం సంపాదించాలంటే పదమూడు ఇంటర్వ్యూలు పేస్ చేయాలని నా ఉద్దేశం కాదు. నాకు తెలిసిన నిజాలు చెప్పడమే నా ఉద్దేశం. అలాగని చెప్పి ఇప్పుడు జేబునిండా రికలూ, లంచాలూ పట్టుకుని బయలుదేరుతున్నా ననుకునేరు. నాకు అవంటే పెంటకుప్పలంతా, చెత్త డబ్బాలంతా అసహ్యమనికాదు. నాకు వాటిని తీసుకొచ్చేటంత పలుకుబడీ, డబ్బూ లేవు" అన్నాడు.

అత నలా చెబుతుంటే భయమేసింది. 'నీ కరుణారస కథ కేమిగాని, నన్ను బేజారెత్తించేస్తున్నావు. ప్రాణాలు తోడేస్తున్నావు. జరిగేదేదో జరగక మానదు ఎలానూ. అందుచేత అందాక ఆ భయంకర సత్యాలు ఆపేయ్, బాబూ' అనేద్దును ఇంకా ఆ వాగుడు కంటిన్యూ చేస్తే.

అతను 'భయంకర సత్యాలు' కంటిన్యూ చేయకుండా భగవంతుడు రక్షించాడు.

ఫ్యాక్టరీకి చేరుకున్నాం.

ఓరి బాబోయ్! ఎంత మందో! వీళ్ళంతా తెల్లారక ముందే చీకట్లో వచ్చేశారులా గుంది. నాకు ఆ ముప్ఫయి మందీ మూడు వందల్లా కనిపించారు. మూడు వందల్లా కనిపించే ముప్ఫయి మంది కుర్చీల్లో కూర్చుని ఉన్నారు.

డొక్కు వాచీ బాబు నాకు ఒక కుర్చీ చూపించి కూర్చోమనిచెప్పి నేను కూర్చున్నాక, నా పక్కనే దగ్గరగా మరో కుర్చీ వేసుకు కూర్చున్నాడు.

నేను తప్పించి అంతా మగవాళ్ళే వున్నందుకు — నాకు సిగ్గుగా, బిడియంగా, భయం భయంగా, అదోలా అనిపిస్తూంది.

అందరికీ నాకు మల్లే గుండెల్లో పీచు పీచు మంటుందనిపించి తృప్తి కలిగింది.

వచ్చే ఉద్యోగానికి ఇంతమంది అడ్డు వున్నందుకు కోపం, అయ్యో ఇంత మంది నిరుద్యోగులు అలమటిస్తున్నారే అన్న జాలి కలిగాయి.

అయితే నా జాలికి వాళ్ళకు ఉద్యోగాలు వచ్చేయవు. నాకు కోపం వచ్చిందని పారిపోరు.

అలాగే వాళ్ళు కూడా నాలాగే అనుకుంటూ కనిపించింది. వుద్యోగాలకి ఆడవాళ్ళు మగవాళ్ళకి పోటీగా వచ్చేస్తున్నారన్న కోపం, అయ్యోయ్యో ఏ పరిస్థితిలో ఆడకూతురు వుద్యోగం చేయవలసి వచ్చిందో అన్న జాలి కలగవచ్చు. అయితే వాళ్ళ జాలి నాకు ఉపకారం, కోపం అపకారం చేయలేవు. నాకు యీ రకమైన ఊహ వచ్చినందుకు నవ్వొచ్చింది.

ఎవరెన్ని ఏడ్చినా ఏమీ చేయలేరు, అంతే అదృష్టం. ఇంత మందిలో అదృష్టం ఎవరికి దక్కుతుందో?

అదే డొక్కు వాచీ బాబు అయితే "అదృష్టం, గిదృష్టం అంతా నాన్సెన్సు, ఎవరు ఎక్కువ 'రిక్'లూ, లంచాలూ తినిపిస్తారో వాళ్ళదే ఛాన్సు" అంటాడు గాబోలు. నిజమే కావచ్చేమో? పాపం, జీవితంలో చాలా దెబ్బలు తిన్నట్టు కనిపిస్తూంది. ఏమిటో జీవితాలు! చాలా మంది జీవితాలు విషాదాలేనా?

"ఏమండోయ్!" అన్నాడు డొక్కు వాచీ బాబు.

"ఏమండీ?" అన్నాను.

"ఎంత పిలిచినా పలకరేమిటండీ. సరేగాని, అక్కడ ఆ నాలుగో కుర్చీలో కూర్చున్నాడు, చూసేరూ? చింతపండు రంగు ముఖం, పైకి తన్నుకొచ్చిన బొజ్జా, గేదె మెడలో కన్నెలా గున్నవాడి ముదర మెడకి పైన బొర్రముక్కూ.... కనిపించేడా? చూసేరా. వాడి కెందుకు చెప్పండి, వుద్యోగం? వాళ్ళ నాన్న బంగారు షాపులో కూర్చుంటాడు. వాడి అన్నయ్య లక్షల మీద కాంట్రాక్టు చేస్తుంటాడు. వాడి అమ్మ ఇంట్లో కూర్చుని వడ్డీ వ్యాపారం చేస్తూంటుంది. ఇక వాడికేం లోటు, చెప్పండి? వాడికెందుకు ఉద్యోగం, చెప్పండీ? అంటే, వాడు సరదాకో, ఉబుసుపోకో వుద్యోగం చేయడాని కొచ్చేడన్నమాట. 'ఇలాంటి' వాళ్ళంతా తప్పుకుంటే మనలాంటి వాళ్ళకి కాంపిటీషన్ తగ్గుతుంది గదా? పోనీ, వీళ్ళు సరదాకీ, ఉబుసుపోకా వచ్చినట్టు రారు. బాగా లంచం తినిపించి, ఎక్కడెక్కడ్ణించో

'రిక్'లు కొట్టించి వస్తాడు. చూసేరా, వాడు 'ఉద్యోగం ఎందుకు రాదో చూస్తా'నన్నట్టు బొజ్జ తన్నించి ఎలా కూర్చున్నాడో?" అన్నాడు.

అతని కసికి నాకు నవ్వొచ్చింది.

ఇంతలో ఒకతను వచ్చాడు. అతణ్ణి చూస్తే ఎవరికైనా నవ్వొస్తుంది. మనిషి చాలా పొట్టి, పట్ట బుర్ర. డాకలాంటి పొట్ట. చిన్ని కళ్ళు. పెద్ద చెవులు. కప్ప నోరు. మాడిపోయిన రంగు. చూడ్డానికి చిన్న సైజు గున్న ఏనుగులా ఉన్నాడు. వయసు నలభై దాటి ఉండవచ్చు. నలభై అయినా దాటక పోవచ్చు.

తను పెర్సనల్ ఆఫీసరికి 'పి. ఎ.' నని పరిచయం చేసుకున్నాడు.

తరవాత గున్న ఏనుగు ఒక లిస్టు తీశాడు. చాలా పేర్లు చదివాడు. ఫుల్ అటెండెన్సు వచ్చింది.

తరవాత అందరి సర్టిఫికేట్లూ వెరిఫై చేశాడు. చేసి వెళ్ళిపోయాడు.

మరి కాస్సేపటికి సైకాలజీ టెస్టు జరిగింది. రికెన్ టెస్టు జరిగింది. సైన్సు స్పీడు టెస్టు జరిగింది.

ఇవన్నీ జరిగేటప్పటికి మధ్యాహ్నం పన్నెండు దాటింది.

రెండు గంటలకి 'ఓరల్ టెస్టు' ఉందని ఈ లోపుగా కాంటీన్‌లో భోజనాలు ముగించుకు రమ్మన్నాడు గున్న ఏనుగు.

కాంటీన్‌కి వెళ్ళబుద్ధికాలేదు. భోజనానికి సరిపడే డబ్బుల్లేక కాదు గాని, భోజనం మీద ఏమాత్రం ఇష్టం పుట్టక, ఆకలి వేయక.

అక్కడికి కొంత దూరంలో మామిడి తోట ఉంది. అక్కడికెళ్ళి మామిడిచెట్టు నీడను చెట్టుకి చేరగిలబడి కూర్చున్నాను. అక్కడ ప్రాణాని కెంతో హాయిగా ఉంది.

సూర్య కిరణాల్ని అటకాయించేస్తూ దట్టంగా, గుబురు గుబురుగా, పందిరిలా అల్లుకుపోయిన మామిడి కొమ్మలూ, చల్లటి చిక్కటి గాలి. వీస్తున్న గాలిలో మత్తుగా మోసుకొస్తున్న మామిడాకుల సువాసనా, నేలపై చెట్టాపట్టా లేసుకుంటున్న వెలుగు నీడలూ సెలయేరులా చప్పుడు చేస్తున్న ఎండుటాకుల అల్లరి. అక్కడక్కడ తివాచీలు పరిచినట్టు

ఎత్తుగా, మెత్తగా ఉన్న పచ్చగడ్డి దిబ్బలూ, ఉడతల చిలిపితనం, పైన గోర్ల కిలకిలలూ....

అబ్బ ! ఆ వాతావరణం నాకు చాలా హాయి అనిపించింది. ఇంటినీ ఇంట్లో సమస్యలైన బాధల్నీ, రక్తసంబంధాల్నీ, మమకారాల్నీ, బాధ్యతల్నీ సమస్తం, సర్వం మరిచిపోయి అక్కడే, అలా జీవితాంతం ఉండి పోవాలనిపించేసింది.

అలా ఎంతసేపు ఉన్నానో, ఏం చేస్తున్నానో నాకే తెలియదు. నేను ఏ లోకంలో విహరిస్తున్నానో, ఏ రంగుల స్వప్నాలు తిలకిస్తున్నానో, ఏ పూవుల వాటిలో విహరిస్తున్నానో, ఏ మల్లెల ఊయల ఊగుతున్నానో తెలియని మత్తులో, మధుర జగత్తులో ఉండగా 'హలో' అంటూ ఎవరో అంతరాయం కలిగించారు.

ఏకాంతంలో ప్రశాంతతకీ, తియ్యని ఆనందానికీ భంగం కలిగించింది ఎవరు ?

భగ్నం కలిగించింది భగవంతుడైనా సరే, పీకనులిమేద్దా మనిపించింది.

అయితే భగ్నం కలిగించిన వ్యక్తి భగవంతుడు కాదు, భగవంతుడు పంపాడనుకున్న డొక్కావారి బాబు.

డొక్కావారి బాబు పీక నులిమేయలేను. అంత కోపం, చిరాకూ వచ్చినా, వాటిని చిరునవ్వుతో కప్పేసి మానవ సహజమైన కృత్రిమ స్వరంతో "రండి రండి" అన్నాను.

"సారీ, మీ ఏకాంతాన్ని డిస్టర్బ్ చేసినట్టున్నాను" అన్నాడు.

"అబ్బే ! అదేమీ లేదండీ" అన్నాను, అలా అనాలి గాబట్టి.

"టెస్టులన్నీ ఎలా చేశారూ ?" అనడిగాడు.

"బాగానే చేశానండీ. కాని, మీరు లంచం, రికోలనే మంత్రాలు పల్లకపోతే ఉద్యోగాల చింతకాయలు రాలవనేవారు గదా ? అదే భయంగా ఉంది" అన్నాను నవ్వుతూ, ఆ రకం టాపిక్ అంటే అతనికి ఇష్టం గాబట్టి.

"మీరేం భయపడకండి" అని అభయమిచ్చాడు డాక్కా వాడీ బాబు. " మీరలా డిజప్పాయింటు అయిపోగూడదండీ. అలా భయపడగూడదండీ. వుద్యోగాలివ్వడంలో అవినీతి సాధారణంగా కొన్ని దిక్కులనే నా వుద్దేశంగాని సర్వసామాన్యంగా, సర్వదిక్కులా అంతేననికాదు. అందుచేత మనం యిక్కడ న్యాయం జరుగుతుందనే ఆశించాలి. ఎక్కడికక్కడ ఆశ వెలిగించుకోవాలండీ. లేకుంటే బతకగలమా? నాకు ఆ ఆశే లేకపోతే యిన్ని ఇంటర్వ్యూలకి ఎలా రాగలను, చెప్పండి? గమ్మత్తు చూసేరూ—ఒక్కొక్కసారి అవినీతి దగ్గర కూడా మనకు ఛాన్సు తగులుతుంది. పెద్ద పెద్ద 'రెక్'లు పది దిక్కుల్నుంచీ పడిపుండి తీసుకొస్తే ఎవరి కివ్వాలో అర్థంకాక చిరాకుతో మనలాంటివాళ్ళ కిచ్చేయవచ్చు. లేకుంటే మనలాంటి పేరుగలవాడెవడో పెద్ద రెక్ తగిలిస్తే అది మనమే అనుకొని మనకే వుద్యోగం యిచ్చేయవచ్చు. అందుచేత మనం చెప్పలేం. కాని, మీ విషయంలో మటుకు చెప్పేయగలనండోయ్! మీకు వుద్యోగం గన్‌షాట్‌గా, ష్యూర్‌గా రావడం ఖాయం."

"గన్‌షాట్‌గా, ష్యూర్‌గా రావడం ఖాయం అని ఎందు కనిపిస్తోంది?" క్యూరియస్‌గా అడిగేను.

"ఎందుకనేది సరిగా చెప్పలేనుగాని, ఒకటి - ఇంటర్వ్యూ చేసేది సాధారణంగా మగవాళ్ళే గదా? ఇంటర్వ్యూకొచ్చిన మగవాళ్ళు ఎంత టిప్‌టాప్‌గా వున్నా, పెర్సనాలిటీ వున్నా అందమైన ఆడపిల్లే ఎక్కువ ఆకర్షించగలదు. అది సహజం. ఆడదాని అందం ఆకర్షించబడ్డం సదుద్దేశంతో కావచ్చు, దురుద్దేశంతో కావచ్చు. అది వేరే సంగతి. కాని వుద్యోగం ఆడవారికి చిక్కడానికి అవకాశం ఎక్కువ గదా? మీరు ఎంత నిరాడంబరంగా వున్నా గులాబీ రాశిలా, చెక్కిన శిల్పంలా అందంగా వుంటారు—నా చనువుకి కోప్పడకండి. అందుకే మీకు గన్‌షాట్‌గా వుద్యోగం వచ్చి తీరుతుందనేది."

అతనలా అన్నందుకు నాకేం కోపం రాలేదు. నన్ను అందగత్తెనని పొగిడినందుకు సిగ్గుతో, ఉద్యోగం వచ్చి తీరుతుందన్న ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాను.

కాని, అదేమిటీ— సదుద్దేశం, దురుద్దేశం ఏదో అన్నాడు. నాకు సరిగా అర్థంకాలేదు. వివరంగా చెప్పమని అడిగాను.

"మీరు పూర్తిగా అమాయకుల్లాగున్నారండీ. వాటిలో పూర్తిగా అర్థముంటే యింకా అర్థం విడదీసి చెప్పమంటారేమిటి? సరే చెపుతాను. వినండి. సదుద్దేశం అంటే ఇల్లాలై ఇంటికి దీపంలా వెలిగే ఆడది ఉద్యోగినై ఫ్యాక్టరీ ఫ్యాక్టరీకీ వేయి మణిదీపాలై వెలగగలదు' అని నిర్వచించవచ్చు. ఇకపోతే దురుద్దేశం అంటారా? దురుద్దేశమంటే.... అంటే.... మీకు నిజంగా అర్థంకాలేదూ? వినండై తే. ఆడవాళ్ళు విధిలేక చేయవలసి వచ్చిన ఉద్యోగాల్ని ఆసరా చేసుకొని ఆ ఆడవాళ్ళ శీలంతో, మానంతో చెలగాటాలాడాలనే సరదా అని అనుకోవచ్చు."

నాకు అలా అనగానే ఎక్కడలేని భయం కలిగింది. కడుపులో పేగుల్ని పెకలించినట్టయింది.

"అమ్మో!" అన్నాను భయంగా, గుండెలమీద చేతులేసుకుని.

"అమ్మో అని భయపడతారేమిటండీ? ఆడదంటే మాటలు కాదు. శక్తిస్వరూపిణి. ఆదిశక్తి. ఈదురుగాలికి చిగురుటాకులా వణికిపోయే ఆడదే, సమయం వస్తే భద్రకాళి అయి నిప్పులా భగభగ మండగలదు. ప్రపంచాన్నే దహించేయగలదు. అందుచేత నిప్పుతో చెలగాటమాడే వారు — ఎవరైనాసరే— ఏమవుతాడు?"

"మలమల మాడి, మండి, మసైపోతాడు" అన్నాను, నవ్వుతూ కసిగా.

'నేను నిప్పులాంటిదాన్ని' అనుకున్నాను ధైర్యంగా.

తరవాత కొంతసేపు అధికారుల అవినీతి, అన్యాయాలు, అరాచకత్వం, నియంతృత్వం, అసమానత గర్హిస్తూ, ఉద్రేకంగా ఉపన్యసించాడు డొక్కావారి బాబు.

నాకు కొంత బోర్ కొట్టి, "ఇక లేద్దామండి. ఓరల్‌కి టైమవుతున్నట్టుంది." అన్నాను.

"ఫర్వాలేదు. ఇంకా టైముందని నా తిరగని వాచీ చెబుతోంది. దయచేసి కాసేపు — అయిదు నిమిషాలు — ఓపిగ్గా కూర్చోండి. మీకో ముఖ్యవిషయం ఒకటి చెప్పాలనుకుంటున్నాను."

ఏమిటో ఆ ముఖ్యవిషయం?!

"చెప్పండి" అన్నాను కుతూహలంగా.

"చెపుతాను. కాని, మీరేం అనుకోరు గదా!"

"అనుకోను, చెప్పండి:"

"నాకీ రోజు ఎందుకో కొత్తగా, వింతగా, పులకరింతగా కనిపిస్తోంది. ఆరిపోయే ముందు ప్రకాశవంతంగా వెలిగే కొవ్వొత్తిలా — నాకీ రోజు ప్రపంచమంతా అతి ప్రశాంతంగా, దివ్య తేజోవంతంగా కనిపిస్తోంది. ఆ ప్రపంచం మీరేనేమో ననిపిస్తోంది. మీ పరిచయ భాగ్యం. మీతో మాటాడ్డం నోచుకోవడం ఎలాగుందంటే — ఉరితాడు వేసి, నల్లగుడ్డ ముఖానికి కప్పేముందు అడగ్గా యిచ్చిన వరంలాగుంది. నా మాట మీరు నమ్మాలి. ఎందుకో మీరు నాకు అత్యంత ఆప్తులుగా, ఆత్మీయుల కన్నా అతీతంగా కనిపిస్తున్నారు. నా గడిచిన జీవితమంతా మీకు ఎందుకో చెప్పాలనిపిస్తోంది. చెబుతాను, వింటారా?"

అంత పెద్ద పెద్ద మాటలు నాకు అర్థరహితంగా, భయంకరంగా తోచాయి. నన్ను ఏ విధంగా 'ట్రీట్' చేస్తున్నాడో అర్థంకాలేదు. అతను యింతకన్నా అతి భయంకరమైంది చెబుతాడేమోనని భయం కలిగినా — "చెప్పండి. తప్పకుండా వింటాను" అన్నాను.

"నేను తల్లీ, తండ్రీ, అన్నా చెల్లెలూ, ఇల్లూ, డబ్బూ ఎవరూ లేని ఏకాకిని. ఏదీ లేని నిర్భాగ్యుణ్ణి. ఎంతోమంది వచ్చీ పోయేవాళ్ళలో నా తండ్రి ఎవరో నా తల్లికే తెలియని గర్భాన పుట్టి, కొన్నాళ్ళకి కళ్ళల్లో పెట్టుకొని పెంచిన ఆ కన్నతల్లి కూడా దూరమవగా, నాకిక ఏ దిక్కూ లేక దిక్కుమాలిన అనాధ శరణాలయపు గోడలకి చిక్కి, అక్కడ బతకలేక బతుకుతున్న నా బతుకును కొంతమంది స్నేహితులు ఆ గోడల్నించి బయటకు లాగారు. ఇప్పటివరకూ వాళ్ళే లేక అలాంటి స్నేహితులే నన్ను చూస్తున్నారు. నా చదువు స్కాలర్‌షిప్పుల మీద,

దయా దాక్షిణ్యాల మీద పి. యు. సి. వరకూ వెళ్ళి.... వెళ్ళి, ఇక ఎంత వెళదామన్నా వెళ్ళలేక ఆగిపోయింది. ఫస్టుక్లాసులో పాసయేనని ఈ వాచీ నాకో లెక్చరరు ప్రెజెంటు చేసేడు. అప్పటిదీ వాచీ బ్రహ్మాండంగా తిరిగేది లెండి. చూడండీ, నా లైఫ్‌లో థ్రిల్ అంటూ లేదు. సుఖమంటూ లేదు. నా కొక ఇల్లంటూ లేదు. ఒక ఇంట్లోనే తిండంటూ లేదు. ఒక్కొక్క సారి ఏ ఇంట్లోనూ తిండి దొరకదు. నా సొంతమంటూ బట్టలేవు. నా స్నేహితుల్లో కొంతమంది 'పేనులా అంటుకొని మనల్ని వదలకుంటున్నావురా, బాబూ' అని చాటున ఎంత అనుకుంటున్నా, తిట్టినా, దెప్పినా — వాళ్ళే కదండీ నాకు తిండీ, బట్టా, సిగా, డబ్బూ ఇస్తున్నది. వాళ్ళ ఋణం నేను జన్మజన్మలకు తీర్చుకోలేనిది! అంతేకాదండీ! నాకు కాల్ లెటర్సు పంపిస్తున్న ఎంప్లాయిమెంటు క్లర్కు కూడా దురదృష్టం కొలదీ ట్రాన్స్‌ఫర్ అయిపోతున్నాడు. అంటే, నాకిది ఆఖరు ఇంటర్వ్యూ అన్నమాట.. ఇంకా చెప్పి మిమ్మల్ని బాధించడం నా కిష్టం లేదు. నా గుండెల్లో బరువు దించుకోవడం కోసం మీ గుండెల్ని బరువు చేయడం నా కిష్టం లేదు. మిమ్మల్ని బోర్ కొట్టిస్తున్నందుకు క్షమించండి. నా జీవితంలో మంచి ఘడియలూ, మధుర సంఘటనలూ ఏమైనా ఉంటే— అది మీ సన్నిధిలో ఈ పావు గంట మాత్రమే."

నా చేతిని అతని చేతుల్లోకి తీసుకొని నొక్కి ఆ చేయిని ముద్దు పెట్టుకొని, గబగబా లేచి వెళ్ళిపోయాడు.

నేను కాసేపు అలానే అప్రతిభురాలినై, ప్రతిమనై ఉండి పోయాను. నా చేతిని ముద్దు పెట్టుకున్నందుకు ఎలాంటి కోపమూ రాలేదు. నరాలు జివ్‌మని లాగేయనూ లేదు.

అతని దారిద్ర్యం ముందు నా దారిద్ర్యం పెద్ద గీత పక్కన చిన్న గీతలా కనిపించింది.

ఇలా ఓరల్ టెస్టు స్టార్టు చేస్తారనగా, కరెక్టుగా వచ్చి చేరుకున్నాను.

అప్పటికే డొక్కు వాచీ అబ్బాయి చేరుకొని ఉన్నాడు.

ఓరల్ టెస్టు నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

తిరుపతిలో దేవ దర్శనం చేసుకొని వచ్చేస్తున్నట్టు—ఒక్కొక్కరూ ఇంటర్‌వ్యూ గదిలోకి వెళ్ళి, రెండు మూడు నిమిషాలకే తిరిగి వచ్చేస్తున్నారు. నేనూ అలాగే వచ్చేశాను. "అమ్మాయ్, నీకు ఇక్కడ ఉద్యోగం చేయడం ఇష్టమేనా? చేస్తావా?" అని ఒక ప్రశ్న అడిగాడు! చిత్రమేమిటంటే, అందర్నీ అదే ప్రశ్న అడిగాడు!. ఇష్టం కాకపోతే ఎందుకొస్తాం? అయినా అదేం ప్రశ్న?

చూస్తూంటే ముందే ఎవరికో పోస్టులు రెండూ 'రిజర్వ్' అయిపోయాయేమో అనిపించి భయం పట్టుకుంది.

సెలెక్టడ్ కాండిడేట్సు పేర్లు కూడా ఇప్పుడే చెబుతారనగానే ఆ భయం తారస్థాయికి అందుకుంది.

చెట్టుపైనున్న కాకి నోట్లో మాంసంముక్క ఎవరి నోట్లో పడుతుందో అని నోరు చాపుకు కూర్చున్న ఆకలి నక్కల్లాగ ఉన్నాం.

లిస్టు పట్టుకొని, అదిగో, వచ్చాడు గున్న ఏనుగు!

తను చదివే పేర్లు గలవాళ్ళు మాత్రం మెడికల్‌కి ఉండాలనీ, మిగతా వాళ్ళంతా దయచేసి వెళ్ళిపోవలసిందనీ కంపెనీ తరఫున అందరికీ కృతజ్ఞతలు చెబుతూ విన్నవించాడు.

పేర్లు చదివాడు.

మొదటిపేరు వరప్రసాద్‌రాజు.

రెండో పేరు నాది!

అయితే, నా ఆనందం ఇంతా అంతా కాదు. చెప్పలేనంత ఆనందం. భరించలేనంత ఆనందం.

గుడిలో మోగే గంటలూ, రంగురంగుల పూవులూ, పువ్వుల పరిమళాలూ, సూర్యోదయం, చంద్రోదయం, వెన్నెలవాడలో ముత్యాల పల్లకీ, వాన వెలిశాక వచ్చిన ఎండా, నవ్వుతూ నాన్న, ఆరోగ్యంగా అమ్మ, ఆకలి కేడవని తమ్ముడూ, కొత్త పరికిణీలో చెల్లెలూ, కళకళ్ళాడుతూ ఇల్లూ కలగాపులగంగా నా మస్తిష్కంలో మెదిలాయి.

దేవుడు నా ప్రార్థనని మన్నించాడు.

"కంగ్రాచ్యులేషన్స్!"

ఎదురుగా గొకుబ్ర-వాటీ అబ్బాయి.

"థాంక్స్" అన్నాను. "మీరుకూడా నా కంగ్రాట్స్ అందుకోండి."

"నా కెందుకూ? !"

"అదేమిటి? భలేవారే! వరహాల్రాజంటే మీరు కాదా?"

"వంటే సేదు పోండి. నా కంత అదృష్టమా! నేను కాదండీ, బాబూ. ఇందాక మనం చెప్పుకున్నాం — చూసేరా బొజ్జమీద పైగాడు. బంగారు పొట్టవాడు బాబూ వరహాల్రాజంటే" అన్నాడు నవ్వుతూ.

నో నో! అలా జరగడానికి వీల్లేదు. అయ్యో! నీవు వరహాల్రాజు అంటే ఎందుకు ఒప్పుకోవు? లేదు, లేదు. నీవు వరహాల్రాజై తీరవల సిందే. అలాకాని పక్షంలో ఎలా నవ్వగలుగుతున్నావయ్యా, బాబూ!

"చూసేరా, నే నన్నానుగా— మీరు సెలక్టు అవుతారనీ? మన మాటకు తిరుగు లేదండోయ్. ఇక వస్తానండి. విష్ యూ ఆల్ ది బెస్ట్!" అని హుంషారుగా విజిల్ కొట్టుకుంటూ వెళ్ళిపోతున్నాడు.

నా మనసు అల్లకల్లోలమై పోయింది. ఒకరి కొచ్చే ఉద్యోగాన్ని మరొకరికి త్యాగం చేసే పద్ధతే ఉంటే— నా ఉద్యోగం అతనికి తప్పక ఇచ్చేద్దు సనిపించింది.

అతను వెళ్ళిపోతూ మధ్య, మధ్య, వెనక్కి తిరిగి చేయి ఊపు తూనే ఉన్నాడు. నేనూ చేయి ఊపుతూ అలా అతను కనుమరుగయ్యే వరకూ చూస్తూ ఉండిపోయాను. కనుమరుగై పోయినా అలా చూస్తూ ఉండిపోయాను

"హి....హి....హి! కంగ్రాచ్యులేషన్సండీ!"

నాకు బొంగ్ర కప్ప అరిచినట్లనిపించింది. ఆ గొంతుక బొజ్జ బాబు వరహాల్రాజుది.

నాకు పెద్ద అసహ్యం వేసింది.

వెధవ వెకిలి నవ్వు నవ్వుతాడేం? తన బొజ్జకీ, తన గొంతుకీ, తన నవ్వుకీ, తన డబ్బుకీ, ఏ ఆడదైనా పడిపోతుందనే గర్వం, ధీమా ఆ వెధవ కున్నాయనిపించింది. చీకటిగా ఉంటే నా ఒంటిమీద చేయి వేసే రాస్కెల్ అని కూడా అనిపించింది.

అలా అనీ నాకు భయం వేయలేదు. నేను నిప్పులాంటి దాన్ని కాల్చి పారేస్తాను. వెధవని—అనుకున్నాను.

వాడికేసి చూశాను చంద్రనిప్పులా.

అంతే, వాడు నిప్పుకి దూరంగా జరిగిపోయాడు. ఇక నా వైపు చూస్తే ఒట్టు. కప్ప వెధవ. పిరికి వెధవ.

వేగంగానే, సవ్యంగానే, మెడికల్ జరిగిపోయింది, దేవుడి దయ వల్ల.

నా చేతికి 'అపాయింటుమెంటు ఆర్డరు' ఇచ్చి, వారం రోజుల్లోపల ఏదో ఒక రోజున ఉద్యోగానికి వచ్చి జాయిన్ అవమన్నాడు గున్న ఏనుగు.

వాడు నాకు 'ఆర్డరు' ఇచ్చేటప్పుడు నా చేతిని కావాలనే తాకాడని తెలుసు.

ఆ వయసులో అదేం పాడు బుద్ధి!

ఇక ఉద్యోగంలో చేరాక బొజ్జ వరహాల రాజులకీ, గున్న ఏనుగులకీ దూరంగా, జాగ్రత్తగా మసలాలన్న మాట।

బస్‌స్టాప్‌కు తొందరగానే చేరుకున్నాను. బస్సు తొందరగానే వచ్చింది. వచ్చిన బస్సు ఖాళీగానే ఉంది.

ఓహ్ ! ఈ రోజెంత సుదినం ! ఎంత సుందరదినం ! నాది ఏమి అదృష్టం ! పట్టిందల్లా బంగారమవుతూంది ఈరోజు. దేవుని పూజలు ఫలించాయి. భగవాన్ ! నీవు పేదలపాలిట పెన్నిధివయ్యా !

బస్సు వెళుతూనే ఉంది. మధ్య మధ్య స్టాపులో ఆగుతూనే ఉంది. ఆగి వెళుతూనే ఉంది.

సడన్‌గా బస్సు ఆగింది. ఆగిన దగ్గర స్టాపు లేదు. గేటు ఉంది.

అయితే గేటు వేసిలేదు. తీసే ఉంది.

మరెందుకు బస్సు ఆగినట్టు ?

అదిగో, గేటుకి పది గజాల దూరంలో పెద్దగుంపు ఉంది. అదేమిటో చూద్దామని డ్రైవర్ వెళ్ళాడు.

వైద్యుడితోపాటు మరికొంతమంది దిగి వెళ్ళారు. నేనూ వెళ్ళాను.

అక్కడ నొక్కవాటి అమ్మాయి శరీరం పడి ఉంది. అతని తల మూసి. సగాల మాంసంలో ఉంది. అతని చేతి వాచీ తిరుగుతూ ఉంది.

అక్కడ ఒక్క నిమిషం కన్నా ఎక్కువ సేపు ఉండలేక వచ్చేశాను. మరి కాసేపు అక్కడ ఉంటే అక్కడే సొమ్మసిల్లి పడిపోవడం ఖాయం. అప్పటికే నా ఒళ్ళు వశం తప్పుతూంది. నాకడుపు తిప్పుతూంది. తల తిరిగిపోతూంది. మనసు మనసంతా అల్లకల్లోలంగా, కలతగా, బరువుగా, బాధగా ఉంది. భోరున ఏడవాలని ఉంది.

కూడూ, బట్టా, నీడా దొరకాలంటే ఇక మిగిలిన పద్ధతి ఇదే నను కొని విలువైన ప్రాణాలు బలిచేసుకున్నావా, మిత్రమా? ఎంతపని చేశావు?

అంతకన్నా గత్యంతరం లేకపోయినప్పటికీ — ప్రాణాలు, రెండు ప్రాణాలు తీసుకోవడమనేది సరిఅయిన పని కాదనిపించింది. అతనలా చేయకుండా ఉండవలసింది. అదే నేనైతే అలా చేయననుకున్నాను.

అతను చెప్పిన విషాద జీవితం, భయంకర సత్యాలు, నా చేతిని ముద్దుపెట్టుకోవడం గుర్తుకు రాకుండా ఎంత అణిచేస్తున్నా గుర్తుకు వస్తూనే ఉన్నాయి.

నా బతుక్కి దారి చూపిన దేవుడు — అతని బతుక్కెందుకు దారి చూపలేక పోయాడో అర్థం కాలేదు నాకు.

నాకు ఉద్యోగం వచ్చిందన్న వార్త విని నాన్న లాటరీ వచ్చినంతగా సంతోషించలేదు. అమ్మ సంతోషించినా "నీకు ఉద్యోగం కాదు గాని, మొగుడొస్తే ఎంత సంతోషిద్దునే" అన్న బాధ చూడగలిగాను. నానిగాడు ఆకలి గురించి ఏడవడం మానేసి పడుకున్నాడు. తమ్ముడు పరీక్షలకి విసుగ్గా చదువుతున్నాడు. చెల్లెలు పెరట్లో కూర్చొని కూనిరాగం తీస్తూంది. నాయనమ్మ కునికిపాట్లు పడుతూంది.

ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు.

ఎందుచేత ?

ఉద్యోగం వచ్చిందన్న ఆనందంవల్లా ! నొక్కవాటి అమ్మాయి మాటలూ, చేష్టలూ గుర్తుకు రావడం వల్లా ?

ఎందువల్లో ఒకందువల్ల !

తెల్లవారి లేచి ఉద్యోగంలో చేరడానికి సిద్ధమవుతూంటే నాన్న బయలుదేర వద్దన్నాడు.

ఈ వేళా, రేపూ అమావాస్య తగిలిందట, ఎల్లుండి జాయినవచ్చ న్నాడు.

"అలాగే" అని ఆ రోజు ఉండిపోయి ఎల్లుండే జాయిన్ అవ డానికి బయలుదేరాను.

'ఇంట్లో కష్టాలు కొంతలో కొంత తొలగే తోవ చూపేవు. ఇక ఆ తోవలో నడిపించే భారం కూడా నీదే' అని బయలుదేరే ముందు దేవు డికి దండం పెట్టుకున్నాను. దేవుడు అనుగ్రహించినట్టుగా, దేవుని పటం నుంచి గన్నేరు పువ్వు నా ఒళ్ళో పడింది. ఆనందంతో కళ్ళు కద్దుకున్నాను.

బయలుదేరేటప్పుడు 'అపాయింటుమెంటు' కాగితం మరిచిపోలేదు. ఎవరూ తుమ్మలేదు. పిల్లి ఎదురురాలేదు. అమ్మ బాధతో మూలగలేదు. నానిగాడు ఏడవ లేదు. సంతోషమే. శుభమే.

నేను ఎక్కిన బస్సుముందు మూడు బస్సుల్ని ఓవర్ టేక్ చేసుకు దూసుకుపోయింది. 'ఏక్సిడెంట్స్' లేకుండా నన్ను సురక్షితంగా దించింది. చేర్చింది. హాయ్ ! హాయ్ సంతోషమే.

చకాచకా ఫాక్టరీకి మూడు నిమిషాల్లో నడిచేశాను. కార్మికులంతా సమ్మె, ఘెరావో ధర్నా అనకుండా బుద్ధిగా పని చేసుకుంటున్నారు. చాలా సంతోషించదగిన విషయం.

దానికి కాస్త దూరంలో ఉన్న అడ్మినిస్ట్రేషన్ బిల్డింగు చేరు కున్నాను. ఆ పసుపు పచ్చని బిల్డింగు మీద బంగారు కిరణాలు పడి వింతగా, అందంగా మెరిసిపోతూంది.

గున్న ఏనుగు పలకరించింది. వరహాల్రాజు ఏదో సైపు చేస్తు న్నాడు. అంటే, అప్పుడే జాయిన్ అయిపోయానన్నమాట ?

పెర్సనల్ ఆఫీసులో కెళ్ళాను. పెర్సనల్ ఆఫీసరు ఆహ్వానిం చాడు. ఆహ్వానాన్ని అందుకొని లోపలికెళ్ళాను. "కూర్చో అమ్మా" అన్నాడు. కూర్చున్నాను. కూర్చుని "థాంక్స్" చెప్పాను, అపాయింటు మెంటు ఆర్డరు అతని చేతికిచ్చాను.

అతడు నన్ను నాన్నలా 'అమ్మా' అని పిలిచాడే గాని, అతనికి నాకున్నంత వయసు ఉండదు. ముప్ఫయి మూడేళ్ళు ఉండచ్చేమో? అతను ఆ కుర్చీలో, ఆ సూటులో ఆఫీసర్‌లాగ ఉన్నాడేగాని, అతని ముఖంలో ఆఫీసరు కళలేదు. సూటూ, బూటూ తీసేసి, సుత్తీ పేనం చేతి కిచ్చి వర్క్‌షాపులోకి పంపిస్తే ఎంచక్కా కూలివాడిలాగా ఉండగలడు అని పించింది. అతనికి ఫ్యాక్టరీలో పనిచేసేఆడవాళ్ళంటే 'దురుద్దేశం' మనిషి అనిపించలేదు.

"చూడమ్మా, వర్కర్స్ యూనియన్ వాళ్ళున్నారు—చూసేవా? వాళ్ళు గొప్ప పెంకితనం చేస్తున్నారు. తుమ్మితే సమ్మె, దగ్గితే ధర్నా చేసి పారేస్తున్నారు. వాళ్ళేం చేసినా చెల్లిపోతోంది. మీకు తెలియదేమో-- మొన్న మీకు ఇంటర్వ్యూలు చేసేటప్పుడు వర్కర్లు పావుగంట 'టూల్ డౌన్' స్ట్రైక్ చేసేరు. మరుసటిరోజు స్ట్రైక్‌నోటీసు యిచ్చేరు. ఎందుకు తెలుసా? మా కూలీల్లో చదువుకున్న కూలీలు కూడా ఉన్నారు. వాళ్ళకి ఎన్నాళ్ళయినా ఎలాంటి మంచిపోస్టులు నేను ప్రొవయిడ్ చేయడం లేదట. నిజమేనమ్మా ఒప్పుకుంటాను. వాళ్ళలో కొంతమంది ఎమ్.ఏ.లూ, బి.ఏలూ ఉన్నారని ఒప్పుకుంటాను. కాని, నేను వాళ్ళని కూలిపనిచేయమన్నానా? మొదట కూలిపనైనా చాలని కాళ్ళావేళ్ళా పడీ, కన్నీళ్లు కార్చి, మా గుండెలు కరగించి ఉద్యోగం సంపాదించీ పెర్మనెంటు అయిపోయేక మా చదువుకి తగ్గ ఉద్యోగా లిమ్మని యూనియన్ ద్వారా పేచీ పెట్టడం, సమ్మె చేస్తామని బెదిరించడం. సమ్మె చేస్తే ప్రొడక్షను దెబ్బ తింటుంది. ఒక్కొక్క సారి ఇలాంటి ఇరకాటంలో పడిపోతామమ్మా, ఇదీ పరిస్థితి."

ఆ పరిస్థితి అంతా నా కెందుకు చెబుతున్నట్టు? పెర్సనల్ ఆఫీసరు ఇరకాటంలో పడిపోయినందుకు నాకు బాధ కలిగినా, అదెందుకు 'ఇరకాటం' అప్పటికీ నాకర్థంకాలేదు. యూనియన్ డిమాండు కూడా నాకు న్యాయం గానే తోచింది. పాపం, ఇంత చదువులు చదివీ, జీవితాంతం కూలిపనులకీ, చాలీచాలని జీతాలకీ అంకితమై పోవడం ఘోరమే!

"వాళ్ళడిగినదానిలో తప్పులేదు కదండీ?" అన్నాను నిర్భయంగా.

"నిజమేనమ్మా, వాళ్ళడిగిన దానిలో తప్పులేదు. ఒప్పుకున్నాను. కాని, వాళ్ళందరికీ మంచి పోస్టులు కావాలంటే అందుకు తగ్గ వేకెన్సీలు ఉండాలి కదా? ఇప్పుడింతకీ యూనియన్ వాళ్ళ బాధ ఏమిటంటే— ఇప్పుడు రెండు గుమాస్తా పోస్టులకీ— పైనుంచి— అంటే మిమ్మల్ని రిక్రూట్ చేసుకోవడం పనికిరాదట. వీల్లేదట. ఆ రెండు వేకెన్సీలూ వాళ్ళకే ఇచ్చేయాలట! అదీ వాళ్ళ గొడవ! అదీ వాళ్ళు సమ్మె చేస్తామని బెదిరింపు. ఆఖరికి నేనూ, యూనియన్ లీడరూ చర్చలు జరిపి, ఒక పోస్టు వర్కరు కిచ్చి, ప్రమోట్ చేయడానికి, మిగతా ఒకటీ ఔట్‌సైడు రిక్రూట్‌మెంటుకీ మొన్నమొన్ననే ఒక ఒప్పందానికొచ్చేం. అందుచేత మిగిలిన ఒక్క పోస్టుకీ వరహాల్రాజుని రిక్రూట్ చేసుకోవడం జరిగింది. అసలు మిమ్మల్నే చేద్దామనుకున్నాను మీరు ముందు వస్తే. అయినా ఫర్వాలేదులే, అమ్మా. నీకు అన్యాయం చేస్తానా? నిన్ను తప్పక రిక్రూట్ చేసుకుంటాను. ఇలాంటి మెరిట్ కాండిడేట్‌నీ, ఇంటెలిజెంట్‌నీ వదులుకుంటానా? తప్పక ఉద్యోగం ఇస్తాను. కాని, ఇప్పుడు కాదు. రెండు, మూడు నెలలు పోయేక. అప్పుడు తప్పక తీసుకుంటాను. అప్పుడో క్లర్క్‌పోస్టు అవసరముంది. ఆ పోస్టు నీకే ఇస్తాను. నీవు సెలక్టు అయిపోయినట్టే లెక్క. కాని, అపాయింటుమెంటు కొంత లేటు. ఎంత? రెండు, మూడు నెలలే కదా? మీరు మాటిమాటికీ రానక్కర్లేదు. మీకు అపాయింటుమెంటు ఆర్డరు పోస్టులో పంపిస్తాను. సరేనమ్మా, డోంట్ వర్రీ. ఇకమీరు వెళ్ళిరండి" అని ఆ అపాయింటుమెంటు ఆర్డరు కాగితం చించేసి చెత్తబుట్టలో పడేశాడు.

చెత్తబుట్టలో చించి పడేసింది ఆ కాగితాన్ని కాదు—నా గుండెల్ని, నా ఆశల్ని, నా బ్రతుకుని, నా జీవితాన్ని.

బాబూ, మీరు పెద్దవాళ్ళు. ఏం చేసినా చెల్లిపోతుంది.

మీరు ఏం చేసినా చెల్లనీయకుండా, కార్మికులకి అన్యాయాలు జరగకుండా యూనియన్ ఉంది.

నా కెవరున్నారు? నాకు జరిగిన అన్యాయాన్ని అడిగేవాళ్ళెవరున్నారు.

దేవుడు.

హుం. దే....వు....డు....

కాళ్ళలో నిస్సత్తువ. తల తిరుగుతూంది. ఒళ్ళు వశం తప్పుతూంది. ఎవరిమీదో తెలియని కసిగా, కోపంగా, పిచ్చిగా ఉంది.

నేనెక్కిన బస్సు గేటు దగ్గర ఆగింది. ఇంకా బండి రాలేదు.

పొక్కు— వాడి అబ్బాయి గుర్తుకొచ్చాడు. అతను ప్రాణాలు తీసుకోవడమనేది 'తప్పని' అనిపించలేదు. నాకూ అంతపని చేయాలని పించింది. కాని. చేయలేను.

ఎందు చేత?

ఇంకా పోయిన ఉద్యోగం మీద ఆశ చేత.

రెండు నెలల్లో నిజంగానే 'అపాయింటుమెంటు ఆర్డరు' వస్తుం దేమోననే ఆశ చేత.

రోజులు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా — ఆశతో — కాలం పరుగెడుతూనే ఉంది.

అమ్మ మంచం మీద మూలుగుతూనే ఉంది. తమ్ముడు పరీక్ష తప్పుతూనే ఉన్నాడు. నానిగాడు "అమ్మా బువ్వ!" అంటూ దెబ్బలు తింటూనే ఉన్నాడు. నాయనమ్మ నల్లమందుకి డబ్బులు కోసంతో అడగ దలుచుకోకుండా మట్టిలోనే కలిసిపోయింది. ఈసారి పారిపోయిన చెల్లెమ్మను నాన్న వెదకడం మానీసేడు. లాటరీ నంబరుకోసం పేపర్లో వెదుకుతూనే ఉన్నాడు.

నేను రాని అపాయింటుమెంటు ఆర్డరుకోసం ఎదురుచూస్తూనే ఉన్నాను.